# గ్రంథపు చుట్టలు

ప్రాచీన కాలంలో తోలు కాగితాలపై గాని లేక ప.ఆపిరస్‌తో చేసిన కాగితపు అట్టలపై గాని గ్రంథాలను లిఖించేవారు. ఈజిప్టులో విస్తారంగా పెరిగే పాపిరస్ చెట్ల నుంచి క్రీ.పూ. 300 నాటికే రాయడానికి అనువుగా వుండే కాగితాలను తయారు చేసేవారు. గ్రంథపు చుట్టల నిర్మాణం అంచెలంచెలుగా వుండేది. పాపిరస్ చెట్ల కాండాలను పలుచటి బద్దల్లా చీల్చేవారు. చీల్చిన బద్దలు మెత్తబడేలా వాటిని వీటిలో ఊరవేసి నానబెట్టేవారు. నానిన బద్దలను ఒక వరుస నిలువుగా మరో వరుస అడ్డంగా ఒక దానిపై ఒకటి తడికలుగా పేర్చే వారు. ఈ తడికలపైన కొయ్య సుత్తులతో కొట్టేవారు. అప్పుడు నిలువుగా అడ్డాలుగా పేర్చిన బద్దలు గుజ్జుగా మారి ఒక దానితో ఒకటి కలసిపోయి అట్టల్లాగా తయారయ్యేది. పెంకుతో లేక చిన్న చిప్పతో ఈ అట్టలను చదును చేసేవారు. ఈ అట్టలను ఎండబెట్టి రాయడానికి అనుకూలంగా వుండేలాగా చేసేవారు. బొగ్గుపొడి నీరు చెట్ల జిగురులను కలిసి మిళితం చేసి నల్లటి సిరాను తయారు చేసి రెల్లుతో చేసిన ఘంటాలతో (కలం) ఈ అట్టలపై రాసే వారు. రాతలో వచ్చే తప్పులను నీటితో తడిపి తుడిచివేసేవారు.

చర్మపు కాగితాలతో తయారైన గ్రంథపు చుట్టలు కూడ వుండేవి. కాలక్రమేణా, చర్మపు కాగితాలే పాపిరస్ అట్టల స్థానాన్ని ఆక్రమించాయి. గొర్రెల మేకలు దూడల తోళ్ళనుంచి వెంట్రుకలు తొలగించి వాటిని చదును చేసి చట్రాలకు బిగించి సాగదీసేవారు. చర్మపు వెలుపలి పొరపై అంటే వెంట్రుకలను తొలగించిన వైపు రాసేవారు. ఈ చర్మపు కాగితాలపై రాసిన రాతలను తొలగించడానికి లేక తుడిచి వేయడానికి వీలులేదు. చర్మపు కాగితాలను ఒకదానితో ఒకటి అతుకు పెట్టి కుట్టి ఒక పెద్ద గ్రంథపు చుట్టగా చుట్టేవారు. మృత సముద్రం సమీపంలోని ఖుమ్రాన్ వద్ద కనుగొన్న యెషయా గ్రంథపు చుట్ట ఇరవైనాలుగు అడుగుల పొడవుంది. పదిహేడు గొర్రె చర్మపు కాగితాలను నారనుంచి తీసిన దారంతో కుట్టి ఈ చుట్టను తయారు చేశారు.